సాక్షి
మహబూబాబాద్
శనివారం | 20 | జూలై | 2024



గోదావరి తీర ప్రాంతంలో జలకళ
మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి తీర ప్రాంతాల్లోని చెరువులు, ప్రాజెక్టులు వరద నీటితో జలకళను సంతరించుకున్నాయి. - 8లో▸



అమరుల త్యాగ ఫలితమే 'పోడు'
ఎందరో విప్లవకారుల ఆత్మ త్యాగ ఫలితమే 'పోడు' వ్యవసాయమని అరుణోదయ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.6°/23.7°

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

నేడు మానుకోట మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్



నోముల రవీందర్

మహబూబాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మానుకోట మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, దోమలు, కుక్కలు, కోతుల సమస్య పరిష్కారం కోసం శనివారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు కమిషనర్ నోముల రవీందర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మున్సిపాలిటీలోని రోడ్లు, ఖాళీ స్థలాలు, పారిశుద్ధ్యం, సొంత ఇళ్లు, స్థలాలను శుభ్రంగా ఉంచుకోవడం తదితర అంశాలపై సలహాలు, సూచనలు చేయడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

నేడు (శనివారం)
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
98499 03608, 76618 84647
సమయం: ఉదయం 11నుంచి 12 గంటల వరకు

మంచంపట్టిన మానుకోట



ప్రతీ గ్రామంలో జ్వరపీడితులు
- విజృంభిస్తున్న డెంగీ, మలేరియా జ్వరాలు
- ఆస్పత్రుల బాట పడుతున్న రోగులు
- ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో డెంగీ, మలేరియా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడుతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పలు గ్రామాలు, తండాల్లో కుటుంబాలకు కుటుంబాలే జ్వరాలబారిన పడి మూల్గుతున్నాయి. కాగా వైద్యారోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా.. అవి ఏ మూలకు సరిపోవడం లేదు.

దోమలు, ఈగలతో..

జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోయినా.. ప్రతీరోజు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో దోమలు, ఈగలు విజృంభించడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడ మండలంలోని కర్లగండి, వేలుబెల్లి, బయ్యారం మండలంలోని వెంకట్రాంపురం, కట్టుగూడెం, బయ్యారం, జగ్గుతండా, గార్ల మండలంలోని ముత్తి తండా, ముల్కనూరు, పుట్టకోట, కురవి మండలంలోని చౌళ్లతండా, సూదనపల్లి, కేసముద్రం మండలంలోని ముత్యాలమ్మ తండా, గూడూరు మండలంలోని కారంపూడి తండాలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

డెంగీ, మలేరియా..

దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు, గిరిజన తండాల్లో డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. గత ఏడాదిలో మలేరియా కేసులు ఆరు మాత్రమే నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటికే జిల్లాలో 11 మలేరియా, 16 డెంగీ కేసులు నమోదు అయినట్లు అధికారులు చెప్పారు. వాస్తవానికి మలేరియా, డెంగీ బాధితులు వందల సంఖ్యలో ఉంటారని అంచనా. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుందని బాధితుల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చలి జ్వరం, ఒంటి నొప్పులు, దురద, దగ్గు, జలుబుతో బాధపడుతూ మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణాప్రాయస్థితికి చేరుకోవడంతో రూ.లక్షలు పెట్టి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే అధిక వర్షాలు కురిసి వాతావరణంలో మార్పులు వస్తే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ముందస్తు చర్యలు లేకనే..

వర్షాకాలం ప్రారంభంలో పారిశుద్ధ్యం, దోమల నివారణ చర్యలు తీసుకోకపోవడం, విషజ్వరాలపై అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 260 పైగా పంచాయతీలు తండాలు, గిరిజన ఆవాస ప్రాంతాల్లో ఉన్నాయి. గ్రామ పంచాయతీ పాలక మండలి పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పట్టించుకోవడం లేదు. అదేవిధంగా పంచాయతీ కార్యాదర్శులకు ఒకవైపు మిషన్ భగీరథ సర్వే, మరోవైపు గ్రామ పంచాయతీ విధుల నిర్వహణ భారం పెరిగింది. పలుచోట్ల పారిశుద్ధ్య పనుల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు, చెత్త డబ్బాలు మూలన పడేశారు. అలాగే పంచాయతీ, వైద్యారోగ్యం, తాగునీటి సరఫరా శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో మురికి కాల్వలు తీయడం లేదని, బ్లీచింగ్ చల్లడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇక రోడ్లపై గుంతలు పడటం, తాగునీటి పైపులు లీకేజీ కావడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫాగింగ్ చేయడం, మురికి కాల్వలు, నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయడం, నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని ప్రజల్లో అవగాహన కల్పించాలి. కానీ గ్రామాల్లో అవేమీ చేయలేదు. దీంతో ప్రజలు మంచం పడుతున్నారు.



చౌళ్లతండాలో ఇంటికే పరిమితమైన జ్వరపీడితులు

చౌళ్లతండాలో..

కురవి: మండలంలోని చౌళ్లతండా, సూదనపల్లి గ్రామాల్లో ప్రజలు జ్వరాలబారిన పడ్డారు. గుండ్రాతిమడుగు(విలేజి) శివారు బంగారుగూడెం జీపీ పరిధిలోని చౌళ్లతండాలో ఇంటింటా మంచం పట్టారు. తండాలో శారద, చంద్రకళ, రామకృష్ణ, హప్లు, రూప్లా, లచ్చిరాంతోపాటు ప్రతీ ఇంటికి ఒకరి చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. ఇంటి వద్దే ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. పీహెచ్‌సీ వైద్యులు చికిత్స అందించాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపన్న డిమాండ్ చేశారు. అలాగే సూదనపల్లి గ్రామంలో అనేక మంది జ్వరంబారిన పడ్డారు. మహబూబాబాద్, ఖమ్మం ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఎల్లుట్ల వెంకటమ్మ అనే వృద్ధురాలు జ్వరంతో మంచం పట్టారు. తాటికాయల లక్ష్మీ, గాండ్ల అభినయ్, అప్పాల వెంకటేష్, ఎలమశెట్టి సాయి, భూపతి వెంకన్న, సులుగురు మల్లేశ్, నీలం నాగన్న, మేకల హర్షవర్ధన్ జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు.



సూదనపల్లిలో వైద్యం చేయించుకుంటున్న జ్వరపీడితులు

న్యూస్‌రీల్

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



మహబూబాబాద్ రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహన తనిఖీలు చేపట్టి, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపి ఇతరుల మరణాలకు కారణం కావొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, పెండింగ్ చలాన్, హెల్మెట్‌ధారణ, తదితర విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాగి వాహనం నడిపేవారు మానవ బాంబులాంటి వారన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యంతాగి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. యువత మద్యం తాగి వాహనాలు నడపవద్దని, తల్లిదండ్రులు కలలు కల్లలు చేయవద్దన్నారు.

కేజీబీవీ తనిఖీ



గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి కేజీబీవీని శుక్రవారం జీసీడీఓ విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం 6గంటలకు విద్యాలయం చేరుకున్న ఆమె.. పాఠశాల మైదానం పచ్చని గడ్డితో ఏపుగా పెరిగిన దృశ్యాన్ని చూసి అవాక్కయ్యారు. ప్రిన్సిపాల్ సునీతను అడుగగా.. చదును చేసేందుకు నిధులు లేవని తెలిపారు. సమస్య పరిష్కారంపై ఆలోచించారు. శనివారం చదును చేయించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి 8.30 గంటలకు బాలికలు భోజనం చేయడాన్ని పరిశీలించారు. కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 295 మంది బాలికలు చదువుకుంటున్నారు. విద్యాలయంలో సమస్యలు తెలుసుకునేందుకే విద్యార్థినులతో రాత్రి నిద్రిస్తున్నట్లు జీసీడీఓ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ పెట్టండి

- డీఈఓ రామారావు

నెల్లికుదురు: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈఓ రామారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: మండలంలోని గంధంపల్లి-కొత్తపేట ఉన్నత పాఠశాలను డీఈఓ రామారావు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రార్థనకు హాజరైన ఆయన ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, హాజరు కాని ఉపాధ్యాయుల సెలవు పత్రాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యాబోధన గురించి సబ్జెక్టుల వారీగా ప్రతి ఉపాధ్యాయుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు.

సొమ్మసిల్లిన విద్యార్థినికి వైద్యం..

పాఠశాల ప్రార్థన సమయంలో 8 వ తరగతి విద్యార్థిని సంధ్య కండ్లుతిరిగి పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఈఓ రామారావు తన కారులో విద్యార్థినిని గంధంపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అనంతరం తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. డీఈఓ వెంట ఏసీజీ ఎం.శ్రీరాములు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సీఆర్పీ రవీందర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న డీఈఓ

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

ఎస్‌ఎస్‌తాడ్వాయి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని విద్యుత్ వినియోగదారుల ఫోరం, టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం ఎస్‌ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదికలో ములుగు డివిజన్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట, వెంకటాపురం, ములుగు మండలాల్లోని వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్, ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ వేణుగోపాలచారి, టెక్నికల్ మెంబర్ రమేశ్, ఇండిపెండెంట్ మెంబర్ రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ వేణుగోపాలచారి మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వినియోగదారుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిష్కరించాలన్నారు. విద్యుత్ వినియోగాదారుల నుంచి 8 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెండు దరఖాస్తులు తటస్థంగా ఉన్నాయని, మిలిగిన ఆరు దరఖాస్తుల పరిష్కారానికి చర్యల తీసుకుంటామన్నారు.




రుణమాఫీ సందడి..

రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలోపు రైతు రుణమాఫీ ప్రకటించడంతో రైతులు శుక్రవారం బ్యాంకుల బాట పట్టారు. రుణమాఫీ అయిన లబ్ధిదారులు, అర్హత ఉన్నప్పటికీ మాఫీ కానీ కొందరు రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి జాబితా చూసుకున్నారు. అర్హత ఉండి రుణమాఫీ పొందని రైతులు బ్యాంక్ అధికారులను సంప్రదించారు. అయితే తమకు సంబంధం లేదని కొందరు బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేటికరణకు బీజేపీ మద్దతు ఇస్తుందని ఆరోపించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక జనాభా కలిగిన మానుకోట జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీ, వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పోడు సాగు రైతులకు పట్టాలు పంపిణీ చేసి హక్కు కల్పించాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, హేమానాయక్, గౌని వెంకన్న, భాగ్యమ్మ, చీపిరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాత్రా, సర్వమంగళ క్రమాల్లో అమ్మవారు




మాత్రా, సర్వ మంగళ అమ్మవారిగా అలంకరణ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి మాత్రా, సర్వ మంగళ క్రమాల్లో పూజలు జరిపారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆదివారం దేవాలయంలో అమ్మవారి మహా శాకంబరీ అలంకారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి కూరగాయలు, పండ్లు సమర్పించాలనుకునే భక్తులు శనివారం సాయంత్రం 5గంటల వరకు దేవాలయ కార్యాలయంలో అందించాలని, ఆతర్వాత ఇచ్చిన కూరగాయలు, పండ్లు అనుమతించబడవని ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

కొనసాగుతున్న టీజీ డీఎస్సీ

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో టీజీ డీఎస్సీ పరీక్షలు ఐదు కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈపరీక్షల్లో ఉదయం సెషన్‌లో 1,212 మందికిగాను 1,164 మంది (96.03శాతం) హాజరుకాగా.. 48 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. రెండో సెషన్‌లో 1,212 మంది అభ్యర్థులకు 1,177 మంది(97.11శాతం) మంది అభ్యర్థులు హాజరవ్వగా 35 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు 5వరకు.. రోజుకు రెండు సెషన్లు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

దండుకునుడే..!

- అవినీతిమయంగా మానుకోట టౌన్‌ప్లానింగ్ విభాగం
- కానులకు కక్కుర్తి పడి నిబంధనలకు తిలోదకాలు
- మాయమవుతున్న చెరువు శిఖం భూములు, గ్రీన్‌ల్యాండ్స్

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిమయంగా మారింది. కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. దీంతో చెరువు శిఖం, ప్రభుత్వ భూములు, చివరికి గ్రీన్‌ల్యాండ్‌లు కూడా కబ్జాకు గురి అవుతున్నాయి. జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతుండగా, అందుకు సంబంధిత శాఖల అధికారులు కూడా సహకరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

ఇంటి నంబర్లు లేకుండా..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు, 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 25,000 పైగా నిర్మాణాలు ఉండగా ఇంటి నంబర్లు లేకుండా సుమారు 5,000 గృహాలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. కొంత మంది ఒక అంతస్తుకు అనుమతి తీసుకుని రెండు, మూడు అంతస్తులు నిర్మిస్తున్నారు. అలాంటి నిర్మాణాలను నిలిపివేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారికి అన్ని విధాలా సహకరిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆతర్వాత డబ్బులు ముట్టజెప్పి ఇంటి నంబర్ వచ్చేలా చూసుకుంటున్నారు. దీంతో అధికారుల జేబులు నిండుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

వారంరోజుల క్రితం జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు శిఖం బఫర్‌జోన్‌లో ఉన్న మూడు ప్లాట్లకు అధికారి గృహ నిర్మాణ అనుమతులు ఇచ్చారు. ఆ స్థలాలు వెంకట్రామ్ టాకీస్ వెనుక ప్రాంతంలో ఉండగా గతంలో గృహ నిర్మాణ అనుమతుల కోసం ఆయా స్థలాల యజమానులు దరఖాస్తు చేసుకోగా ఇరిగేషన్, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆప్రాంతం అంతా శిఖం, బఫర్ జోన్‌లో ఉందని ఆ దరఖాస్తులను తిరస్కరించారు. కాగా ఇటీవల మానుకోట మున్సిపాలిటీకి టీపీఎస్‌గా బదిలీ అయిన ప్రవీణ్ వారంరోజుల క్రితం నిబంధనలను అతిక్రమించి అనుమతులు ఇచ్చారు. వారి వద్ద నుంచి రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని అనుమతులు ఇచ్చినట్లు ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఇలా పలు వార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు, వాటి విషయంలో కార్యాలయంలో గొడవ జరిగినట్లు సమాచారం. ఇరిగేషన్ అధికారుల నుంచి ఎన్‌ఓసీ కూడా తీసుకోకుండానే అనుమతులు ఇవ్వడం కొసమెరుపు.

గ్రీన్ ల్యాండ్‌లకు..

గ్రీన్ ల్యాండ్లకు కూడా అనుమతులు ఇచ్చారు. 34వ వార్డులో ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వగా ఆ వార్డు ప్రజలు కార్యాలయానికి వెళ్లి వినత పత్రం ఇవ్వడంతో పాటు అధికారులతో వాగ్వాదం చేశారు. చివరికి ఉన్నతాధికారుల జోక్యంతో ఆఅనుమతిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆవిషయంలో టౌన్ ప్లానింగ్ టీపీఎస్‌ను ఆవార్డు ప్రజలు అడిగితే అనుమతి ఇచ్చిన తర్వాత రద్దు చేసే అధికారం ఉందని సమాధానం ఇచ్చారు. గతంలో కూడా పలు గ్రీన్ ల్యాండ్లకు ఆ విభాగం అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిలో నిర్మాణాలు జరిగాయి. ఉన్న గ్రీన్‌ల్యాండ్లు కూడా ఇలాంటి అధికారుల వల్ల ఆక్రమణకు గురవుతున్నాయి.



నిజాం చెరువు శిఖం బఫర్‌జోన్‌లో ఉన్న ప్లాట్లు

కబ్జాకు గురవుతున్న భూములు

అధికారుల తప్పిదాల వల్ల చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు చాలా వరకు కబ్జాకు గురి అవుతున్నాయి. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు తీసుకొని దర్జాగా బ్యాంక్ రుణాలు కూడా పొంది పెద్ద పెద్ద భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు.

బఫర్ జోన్‌లోనే ఉన్నాయి

ఇటీవల మున్సిపాలిటీ నుంచి అనుమతి ఇచ్చిన ఆ ప్లాట్లు బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. గతంలో ఎన్‌ఓసీల కోసం పంపిస్తేనే తిరస్కరించాం. ఇటీవల అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. కానీ ఆ ప్లాట్లు మాత్రం బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. రెవెన్యూ నుంచి నివేదిక ఇవ్వగా ఆప్రాంతం అంతా హద్దులు పెట్టి ఫెన్సింగ్ చేయిస్తాం. మున్సిపాలిటీ అధికారులు ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీలు లేకుండా అనుమతులు ఇవ్వొద్దు.

- కిశోర్, ఇరిగేషన్ శాఖ డీఈ

హద్దుచూసి అనుమతి ఇచ్చాం..

జిల్లా కేంద్రంలోని వెంకట్రామ్ టాకీస్ వెనుక ప్రాంతంలో చెరువు హద్దులు చూసి దాని ప్రకారం అనుమతులు ఇచ్చాం. అన్ని నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. అవసరమైతే మరోసారి ఆ స్థలాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనుమతి రద్దు చేసే అధికారం కూడా ఉంది.

- ప్రవీణ్, టీపీఎస్

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

● కూతురుకు భూమి ఇవ్వకుండా అడ్డుపడుతున్న కొడుకును చంపించిన తండ్రి


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి మండలం రాంపూర్ శివారు అడవుల్లో గత మే నెలలో గుర్తు తెలియని మృతదేహం లభించిన విషయం తెలిసిందే. ఈ మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అనంతరం ముగ్గురిని అరెస్ట్ చేశారు. కూతురుకు 20 గుంటల భూమిని ఇవ్వకుండా అడ్డు పడుతున్నాడని కుమారుడిని తండ్రి చంపించాడు. ఈ మేరకు శుక్రవారం భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రందాన్‌తండాకు చెందిన గుగులోతు ప్రభాకర్(29)ను పర్వతగిరి మండలం తురకల సోమవారం గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, బానోత్ సిద్దు, బానోత్ శ్రీను ఏప్రిల్ 23వ తేదీన భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం తండాలో పెళ్లి సంబంధం ఉందని పథకం ప్రకారం తీసుకొచ్చారు. మార్గమధ్యలో రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం సేవించి ప్రభాకర్ తలపై బండతో కొట్టి వారి వెంట తీసుకొచ్చిన పెట్రోల్ పోసి నిప్పు అంటించి పారిపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పట్టణ సమీపంలోని కేటీకే–5వ గని వద్ద ఎస్సై ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో ఈ ముగ్గురు వచ్చి పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించారు. మృతుడి తండ్రి నరసింహస్వామి తన కొడుకు ప్రభాకర్‌ను చంపితే రూ.50వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి ఒప్పుకున్న బానోత్ బాలాజీ అతడి కొడుకు సిద్దు, తమ్ముడు శ్రీను పథక ప్రకారం పెళ్లి సంబంధం ఉందని ప్రభాకర్‌ను రాంపూర్ అడవికి తీసుకొచ్చి హతమర్చినట్లు నేరం ఒప్పుకున్నారన్నారు. మృతుడు తన చెల్లికి 20 గుంటల భూమి ఇవ్వకుండా అడ్డుపడుతున్నాడని హత్య చేసినట్లు తెలిపారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ నరేశ్, ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి


భవాని(ఫైల్)

అత్మకూరు: మాయదారి మృత్యువు మాటు వేసి కాటువేసింది. రెండు నిమిషాలైతే గమ్యానికి చేరేది. అంతలోనే అనంతలోకాలకు తీసుకెళ్లింది. లారీ రూపంలో మింగింది. మండలంలోని గూడెప్పాడ్ జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్త, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలబద్ర దినేశ్ వరంగల్ నుంచి బైక్‌పై భార్య భవాని(23) ఏడాదిన్నర కుమారుడితో వస్తున్నాడు. రెండు నిమిషాల్లో గూడెప్పాడ్‌కు చేరుకునే క్రమంలో పరకాల నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొనడంతో వీరందరికీ తీవ్రగాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న సీఐ సంతోష్, సిబ్బంది తమ వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా భవాని మృతిచెందింది. ఈ ఘటనపై సీఐ సంతోష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి తీర ప్రాంతంలో జలకళ

రెండు రోజుల నుంచి గోదావరి తీర ప్రాంతంలో జోరు వాన కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు, ఉప్పొంగుతున్నాయి. ములుగు జిల్లాలోని పాలెం ప్రాజెక్టు వరద నీటితో కళకళలాడుతోంది. అలాగే, రామప్ప సరస్సు నీటి మట్టం 24 అడుగులకు చేరింది. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ వద్ద గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. వరద ఉధృతికి కొన్ని గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా, శుక్రవారం నుంచి మరో నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అప్రత్తంగా ఉండాలని అధికారయంత్రాంగం పేర్కొంది.


నిండుకుండలా కనిపిస్తున్న పాలెం ప్రాజెక్టు

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలం మల్లాపురం సమీపంలో నిర్మించిన పాలెం వాగు ప్రాజెక్టు శుక్రవారం జలకళ సంతరించుకుంది. మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు కళకళలాడుతోంది. సామర్థ్యానికి మించి వరద చేరడంతో ప్రాజెక్టు సంబంధించిన నాలుగు గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, ప్రాజెక్టు నిండడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగి తగ్గుతున్న గోదావరి

వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరి ఉధృతంగా పెరిగి నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 12.73 మీటర్లకు చేరుకుంది. సాయంత్రం నుంచి తగ్గు ముఖంపట్టింది. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉధృతి పెరిగింది. ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షం సైతం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది.


సమ్మక్క సాగర్ వద్ద తగ్గుతున్న గోదావరి ఉధృతి

శాంతించిన గోదావరి

● తగ్గుతున్న వరద ప్రవాహం
● సమ్మక్కసాగర్ వద్ద 3,75,430 క్యూసెక్కులు

కన్నాయిగూడెం: రెండు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహించిన గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి శాంతించింది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ వద్ద గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఉదయం బ్యారేజీ వద్ద 3,82,057 క్యూసెక్కులు ఉన్న వరద ప్రవాహం సాయంత్రం వరకు 3,75,430 వరకు చేరింది. బ్యారేజీలో 78.50 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. గురువారం వరకు 52గేట్లతో నీటిని వదిలిన అధికారులు శుక్రవారం 59 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలారు. గురువారం వరకు దేవాదుల పంపింగ్‌ను కొనసాగించిన అధికారులు శుక్రవారం నిలిపివేశారు

24 అడుగులకు చేరిన రామప్ప సరస్సు నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న రామప్ప సరస్సు

వెంకటాపురం(ఎం): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామప్ప సరస్సు నీటిమట్టం 24 అడుగులకు చేరింది. 35 అడుగుల నీటి సామర్థ్యం గల సరస్సులో గతంలో 20.6 అడుగుల నీరు ఉండగా ప్రస్తుతం 3.6 అడుగుల మేర వర్షపు నీరు చేరడంతో సరస్సు నీటితో కళకళలాడుతుంది. రామప్ప సరస్సు అధికారికంగా 5180 ఎకరాలు, అనధికారికంగా మరో 5 వేల ఎకరాలు సాగవుతాయి. కాగా సరస్సు నీటితో కళకళలాడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాటారం మండలంలో భారీ వర్షం

● అలుగువాగులో కొట్టుకుపోయిన ఆటో


గుమ్మాళ్లపల్లిలో కూలిన ఇంటి గోడ

కాటారం: కాటారం మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. పోతులవాయి సమీపంలోని బొర్రవాగు, గంగారం వద్ద గల చిన్న వాగు, ఒడిపిలవంచ వద్ద గల వాగు, దామెరకుంట–గుండ్రాత్‌పల్లి మధ్య గల అలుగువాగులో వరద నీరు ఉధృతి ఎక్కువై ప్రధాన రహదారిపై గల కాజ్‌వేల పైనుంచి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాలకు ఉదయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం తెల్లవారుజామున మహదేవపూర్ మండలం అన్నారం వైపు నుంచి దామెరకుంట వైపుగా వెళ్తున్న ట్రాలీ ఆటో గుండ్రాత్‌పల్లి సమీపంలో గల అలుగువాగులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై ఆటో ఎక్కి కేకలు వేయడంతో గమనించిన స్థానికులు రక్షించారు. గుమ్మాళ్లపల్లి ఎస్సీ కాలనీలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. సమ్మక్క ఇంటి గోడలు కూలిపోయాయి. ఆయా గ్రామాల్లో పత్తి చేలలోకి వరదనీరు చేరింది. అలుగువాగు, బొర్రవాగు వరదనీటి ఉధృతిని తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ వెంకన్న పరిశీలించారు. వాగుల్లో ఉధృతి తగ్గే వరకూ రాకపోకలు సాగించొద్దని సూచించారు. ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో వాగుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వాగు వద్ద నిలిచిన అంబులెన్స్



కాటారం: వాగులో నీటి ఉధృతి కారణంగా అంబులెన్స్ మార్గమధ్యలో నిలిచింది. ఈ ఘటన కాటారం మండలం పోతుల్వాయి సమీపంలో కాటారం–మహాముత్తారం ప్రధాన రహదారిపై గల బొర్రవాగు వద్ద చోటు చేసుకుంది. మహాముత్తారం మండలం నిమ్మగూడేనికి చెందిన తాడాంద్ర శంకర్‌కు తేలుకాటు వేసింది. దీంతో ఆస్పత్రి వెళ్లడం కోసం 108కి ఫోన్ చేశారు. మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నిమ్మగూడెం బయలుదేరిన 108 అంబులెన్స్ బొర్రవాగు వద్దకు చేరుకుంది. వరద నీరు కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడే నిలిచింది. దీంతో శంకర్‌ను కుటుంబీకులు బైక్‌పై పోతుల్వాయి వద్ద వాగుకు తీసుకొచ్చారు. అక్కడే ఉన్న స్థానికులు, అధికారులు వాగు దాటించి 108 అంబులెన్స్ ఎక్కించి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శంకర్ ఆరోగ్యం బాగానే ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. కాగా, గతంలో రోగులను తీసుకురావడానికి వెళ్లాల్సిన అంబులెన్స్ పలుమార్లు వరదనీటి ప్రవాహానికి ఇక్కడే నిలిచిన ఘటనలు ఉన్నాయి.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


రాజు (ఫైల్)

వెంకటాపురం(కె): గోదావరి నదిలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం ఆలుబాక పంచాయతీ పరిధి తానిపర్తిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బానారి రాజు (45) గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పి గోదావరిలో చేపల వేటకు వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం వరకూ ఇంటికి రాకపోవడంతో రాజు భార్య సమ్మక్క, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గ్రామస్తులకు తెలపడంతో వారు రాజు ఆచూకీ కోసం శుక్రవారం ఉదయం నుంచి నాటు పడవల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాజు గల్లంతైన విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు

తండ్రి నిర్దోషి అని తేలినా తీసుకెళ్లేందుకు ససేమిరా

● సొంత ఖర్చులతో పంపిన జైలర్ శ్రీనివాసరావు


సత్తయ్య(తలకు రుమాలు చుట్టుకున్న వ్యక్తి)ను ఇంటికి తీసుకెళ్లిన జైలు సిబ్బంది కుమారస్వామి

మహబూబాబాద్ రూరల్ : తండ్రి నిర్దోషి అని కోర్టు తీర్పునిచ్చినా.. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లేందుకు ససేమిరా అన్నారు. అతను మానసిక వికలాంగుడు కావడమే కారణం.. అతని దీనస్థితిని గమనించిన జైలర్.. ఆ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి సొంత ఖర్చులతో గ్రామానికి పంపించారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన తండ సత్తయ్య తన భార్యను చంపాడనే నేరారోపణతో సంవత్సరకాలంగా మహబూబాబాద్ జిల్లా జైలులో శిక్ష అనునభవిస్తున్నాడు. సత్తయ్య మానసిక వికలాంగుడు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ కేసు కొట్టేసి సత్తయ్యను నిర్దోషిగా ప్రకటించారు. ఈ సమాచారాన్ని జైలర్ శ్రీనివాసరావు శుక్రవారం సత్తయ్య కుటుంబ సభ్యులకు తెలపగా వారు తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీంతో జైలర్ శ్రీనివాసరావు.. సత్తయ్య కుటుంబ సభ్యులకు, అతడి కుమారుడికి వారి బాధ్యతలను గుర్తుచేస్తూ ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సొంత ఖర్చులతో జైలు జవాన్ కుమారస్వామి ద్వారా సత్తయ్యను స్వగ్రామానికి పంపించారు. గ్రామ కారోబార్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. జీవిత చరమాంకంలో ఉన్న మానసిక వికలాంగుడిని వదిలించుకోవాలనుకున్న కుటుంబానికి కనువిప్పు కలిగించిన జైలర్ మల్లెల శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి

● ప్రొఫెసర్ కంచె ఐలయ్య


అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విద్యార్థి, ప్రజా సంఘాల బాధ్యులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి ప్రజా యుద్ధనౌక గద్దర్, చుక్క సత్తయ్య పేరు పెట్టాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ ఉద్యమం–గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా మాట్లాడారు. కవి పేరు కళాక్షేత్రానికి ఎలా పెడతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి, తెలంగాణ లోగో, పాటను మార్చిన తీరుగానే కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్, చుక్క సత్తయ్య పేరు పెట్టాలన్నారు. వరంగల్‌లో చుక్క సత్తయ్య, శంకర్, సారంగపాణి వంటి కళాకారులు, మొగిలయ్య వంటి మొదటి తెలంగాణ ఉద్యమకారుడు ఉండగా కాళోజీ పేరు పెట్టడం కులతత్వం కాదా.. అని ప్రశ్నించారు. గద్దర్‌ను మించిన సాహిత్యకారుడు, కళాకారుడు, నటుడు ఎవరూ లేరన్నారు. ఎన్టీఆర్‌ను మించిన నటుడన్నారు. ఆగస్టు 6వ తేదీన మొదటి వర్ధంతి లోపు వరంగల్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు, కళాక్షేత్రానికి గద్దర్ నామకరణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. గద్దర్ గళం అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, మిత్రులు రూ.40లక్షల ఖర్చుతో విగ్రహాన్ని తయారు చేయించినట్లు తెలిపారు. హెల్త్ యూనివర్సిటీకి ఒక కవి పేరు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. వరంగల్‌లో గద్దర్ 10లక్షల మందితో సభ పెట్టి మొదటిసారి ప్రత్యేక తెలంగాణ తీర్మానం చేశారని గుర్తు చేశారు. గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క, సారలమ్మ పేరు పెట్టినట్లుగానే తెలంగాణలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. గద్దర్ గళం అసోసియేషన్ కార్యదర్శి పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. దేశంలో సాంస్కృతిక విప్లవానికి పురుడు పోసిన మహా కళాకారుడు, వాగ్గేయకారుడు గద్దర్ అని అన్నారు. మంత్రులు, కలెక్టర్, అధికారులు ఈ దిశగా ఆలోచన చేయాలన్నారు. గద్దర్ గళం అసోసియేషన్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య, ఆయా సంఘాల నాయకులు నలిగంటి శరత్, దూడపాక నరేశ్, కన్నం సునీల్, మేడ రంజిత్, కాడపాక రాజేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, దర్శన్ పాల్గొన్నారు.

వంగపహాడ్‌లో పోలీస్ ఔట్‌పోస్ట్ రీ ఓపెన్

● తొమ్మిదేళ్ల తర్వాత పునఃప్రారంభానికి చర్యలు


పునఃప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఔట్ పోస్ట్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో తొమ్మిదేళ్ల తరువాత పోలీస్ ఔట్‌పోస్ట్ సేవలు పునఃప్రారంభంకానున్నాయి. వంగపహాడ్‌లోని ఓ వీధిలో వేశ్య గృహాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన యువతులను ఖరీదు చేసి..ఇక్కడికి తీసుకొచ్చి వ్యభిచారం చేయించేవారు. పోలీసులు దాడుల సందర్భంగా వారు పట్టుబడి కేసులు పాలైన దాఖలాలు కూడా ఉన్నాయి. అయితే పోలీసులు దాడులు నిర్వహించినా ఫలితం కానరాలేదు. ఈ క్రమంలో వేశ్య గృహాల్లోకి విటుల తాకిడిని నివారించడానికి 2010లో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అక్కడ ఏఎస్సై స్థాయి అధికారికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఔట్ పోస్ట్ వల్ల విటుల రాకపోకలు తగ్గాయి. ఐదేళ్ల పాటు ఇక్కడ ఔట్ పోస్ట్ కొనసాగింది. 2015లో ఎలాంటి కారణం లేకుండానే ఎత్తేశారు.

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ..

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఔట్‌పోస్ట్‌ను రీపెన్ చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈమేరకు పాత గదిని వినియోగంలోకి తీసుకొచ్చారు. ఔట్ పోస్ట్‌ను ప్రారంభించనుండడంతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. వారం క్రితం టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మైనర్లు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారు. దీంతో వేశ్య గృహ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు కూడా చేశారు.. ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయొద్దని అధికార పార్టీనేతల వద్ద పరుగులు తీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వారం రోజులుగా వారు పడరానిపాట్లు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

స్పష్టత రాకముందే బేరసారాలు..

ఇదిలా ఉండగా వంగపహాడ్ ఔట్‌పోస్ట్ రీఓపెన్‌పై స్పష్టత రాకముందే పోలీసులతో వేశ్య గృహ నిర్వాహకులు బేరసారాలకు దిగినట్లు చర్చించుకుంటున్నారు. పెద్ద మొత్తంలో బేరసాలు జరిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈవిషయమై కాజీపేట ఏసీపీని అడగగా ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసే అవకాశం లేదన్నారు.

అమరుల త్యాగ ఫలితమే 'పోడు'

● అరుణోదయ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క


మాట్లాడుతున్న అరుణోదయ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో నేడు స్వేచ్ఛగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నారంటే ఎందరో విప్లవకారుల ఆత్మ త్యాగ ఫలితమేనని అరుణోదయ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. 2000, జూలై 19న సరసనపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన జనశక్తి అగ్ర నాయకుడు బండి అల్లోరు అలియాస్ భరత్ సంస్మరణ సభను కుటుంబీకులు శుక్రవారం మండలంలోని ఎంచగూడెంలో నిర్వహించారు. ఈ సభలో విమలక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలక వర్గాల దోపిడీని ప్రశ్నించిన నాయకులను ఎన్‌కౌంటర్ పేరుతో ప్రభుత్వాలే హత్య చేశాయని విమర్శించారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల నుంచి భరత్ ఎన్‌కౌంటర్ దాకా ఎన్నో నిర్బంధాలు ఎదురించి నేల కొరిగిన విప్లవకారుల ఉద్యమాల ఫలితంగానే అటవీ హక్కుల చట్టం వచ్చిందన్నారు. చట్టాలు అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆరోపించారు. విప్లవకారుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కుమారుడు సూర్య, నాయకులు రాజన్న, అరుణక్క, విజయక్క, రవీందర్, గాని అయిలయ్య, శ్రీశైలం, కుటుంబ సభ్యులు బండి కృష్ణ, శ్రీను, స్థానికులు బండి కుమారస్వామి, సుంకర బోయిన మొగిళి తదితరులు పాల్గొన్నారు.

రూ.36,075 విలువైన గంజాయి పట్టివేత

● ఇద్దరి అరెస్ట్, రిమాండ్
● వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్


వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తి మరొకరికి విక్రయించేందుకు యత్నిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారివద్ద నుంచి కిలో 443 గ్రాముల సరుకు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వీఆర్‌ఎస్ గార్డెన్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలోని కోరాపూట్ జిల్లా లంతపూర్ బడిగాడ గ్రామానికి చెందిన బలభద్రఖర మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హన్మంతునిగడ్డ హరిజనవాడకు చెందిన కారపాటి వాసుకు గంజాయి అమ్మేందుకు వచ్చానని ఒప్పుకున్నాడు. దీంతో వారివద్ద నుంచి కిలో 443 గ్రాముల (విలువ రూ.36,075) గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. టౌన్ ఎస్సైలు విజయ్ కుమార్, అరుణ, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ, పీసీలు శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

రూ. 8.80 లక్షల విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధి డాల్ఫిన్ గల్లీలో వ్యాపారి రాజపురోహిత్ జబ్బార్ వద్ద నుంచి రూ. 6,39,400 విలువైన ప్రభుత్వ నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. అలాగే, కాకతీయ థియేటర్ సమీపంలో మరో వ్యాపారి కళరియా రాజా వద్ద నుంచి రూ. 2,40,000 గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో మొత్తం రూ 8.80 లక్షల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ పేర్కొన్నారు.

నమ్మకంగా పనిచేసి నట్టేట ముంచి..

బంగారం చోరీ కేసులో ఘరానా దొంగ అరెస్ట్
● రూ.52 లక్షల విలువైన 700 గ్రాముల బంగారం బిస్కెట్లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా, పక్కన పోలీసు అధికారులు

వరంగల్ క్రైం: బంగారం కరిగించే షాపులో నమ్మకంగా పనిచేస్తూ అదును చూసి భారీ మొత్తంలో బంగారం చోరీ చేసిన ఘరానా దొంగను సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ. 52 లక్షల విలువైన 700 గ్రాముల బంగారం బిస్కెట్లతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా సాల్సింగే తాలూకా భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన సురేశ్ లక్ష్మణ్‌బాద్ ఒంటరిగా జీవిస్తూ బంగారం వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోకపోవడంతో అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చాలంటే బంగారం దుకాణంలో నమ్మకంగా పనిచేసి పెద్ద మొత్తంలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించే బట్టీ వ్యాపారి సంజయ్ వద్ద గత మే నెల 24తేదీన పనిలో చేరాడు. కొద్ది రోజులు నమ్మకంతో పనిచేశాడు. దీంతో దుకాణ యజమాని సంజయ్.. సురేశ్ లక్ష్మణ్‌బాద్‌కు షాపు తాళాలు అందజేసి బయటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గత నెల జూన్ 14వ తేదీన సంజయ్ పనిపై బయటకు వెళ్లడంతో ఇదే అదునుగా భావించిన సురేశ్ లక్ష్మణ్‌బాద్ షాపులోని సీసీ కెమెరాలు బంద్ చేసి 8 వందల గ్రాముల బంగారం చోరీ చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. చోరీ సొత్తును అమ్మేందుకు ఈనెల 18న రైలులో సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా వరంగల్ రైల్వే స్టేషనలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా చోరీ సొత్తు లభించడంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. చోరీ అనంతరం నిందితుడు పూణెలోని నస్రాపూర్‌లో బంగారం కరిగించే బట్టీ వ్యాపారం నిర్వహిస్తున్న తన మిత్రుడు సూరజ్ తానాజీ యాదవ్ వద్ద చోరీ సొత్తు కరిగించాడు. వంద గ్రాముల చొప్పున ఎనిమిది బిస్కెట్లుగా మార్చి అందులో వంద గ్రాముల బంగారం సూరజ్ తానాజీ యాదవ్‌కు విక్రయించాడు. మిగతా 700 గ్రాముల బంగారం విజయవాడలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు సీపీ తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు

గీసుకొండ: బస్సును అజాగ్రత్తగా, అతి వేగంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. గీసుకొండ సీఐ బాబులాల్ కథనం ప్రకారం.. 2017 ఫిబ్రవరి 16న సంగెం మండలం వెంకటాపురానికి చెందిన తాళ్లపెల్లి మధు తన బైక్‌పై గీసుకొండ మండలం ధర్మారం వెళ్లి తిరిగి స్వగ్రామం పయనమయ్యాడు. అదే సమయంలో నర్సంపేట వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ధర్మారం రైల్వే గేటు ఎదుట బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ధర్మారం బస్టాండ్ హోటల్ ఎదుట నిలబడిన నలుగురిని బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి భార్య మానస పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి గీసుకొండ ఎస్సై వి.నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ చంద్రయ్య సాక్షులను ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న వరంగల్ మేజిస్ట్రేట్.. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ దంతాల శ్రీనాథ్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధించారు.